# తెగీ తెగని జ్ఞాపకాలు

ఆమొహం అల్లా పెట్టారెందుకూ; బెల్లం కాఫీ ఇచ్చాననా-?

అల్లం పెసరట్టుకి బెల్లం కాఫీయే నప్పుతుంది.

ఉల్లం రంజిల్లేలా వక్కపొడి వేసుకుని కుక్క పిల్లతో ఆడుకోండి;

వెండికంచంలో వేడిబువ్వ వేసుకుని (మంచంమీద) మజ్జిగ పోసిన ఆవకాయన్నం తింటూ అచ్చు తప్పులులేని పత్రిక చదువుకోడం అదృష్టంగా భావించాలి.

ఏమిటో ఈవాళ కూర్చుని ఈరోటి దగ్గర పెసరపప్పు పచ్చడి రుబ్బుతుంటే నాకనేకానేక భావాలొస్తున్నాయ్. ఈరుబ్బడం మానేస్తే ఆభావాలు రావడం మానేస్తాయ్.

కొన్ని భావాలు బరువుగా చూరు పట్టుకు వేలాడు తున్నట్లుంటాయ్.

కొన్ని ఆవాల్లా అద్దంమీద పరిగెడతాయ్.

మనం హనీమూన్ కెళ్ళాం గుర్తుందా? అదేనండి తణుకులో మీ వాళ్ళింట్లో మేడమీద శుభ్రంగా పందలపాక దుప్పటి పరిస్తే పడుకో లేక తేనెసీసా పట్రమ్మన్నారు.

"హనీమూన్" అంటే తేనెసీసా పట్టుకుని వెన్నెట్లో డాబామీద కూర్చోడం అని చెప్పారు.

దొరలు అలా పెళ్ళీ అదీ అయాక చేస్తారనీ చెప్పారు. అన్నీ అబద్ధాలే.

హనీమూనంటే - కార్యంట

అప్పారావు చెల్లెలు జాకీ (దాని అసలు పేరు జానకి - "నా" వూడదీసి ఏడిపిస్తూంటారు) చెప్పింది మనవాళ్ళు తలుపులుమూసి ఓగదిలోతోసి రక్కుకు పీక్కు ఛావండ్రా - మీకర్మమీది అంటారు.

దొరలు పీక్కుంటూ రక్కుకుంటూ ఓ మూలపడి చావక, వూరూరా తిరుగుతారట - మేమమ్మా మొగుడూ పెళ్ళాలమని.

మనవాళ్ళు ఓమూడు రోజులు వాళ్లింట్లోనూ ఓ మూడురోజులు వీళ్ళింటోనూ ఆఘోరించి ఆ తర్వాత మీ కర్మమీదర్రా పొమ్మంటారు ఆశుభకార్యం దొరలు వూరూరా సాగించుకుంటూ విలాసంగా తిరుగుతారట.

తిరగాల్సిందే మరి... ఇంత కథా కమామీషు వుండగా తణుకు చుట్టాలింటికెళ్ళి -

"వక్కపొడి-కుక్కపిల్లా" అన్నట్లు కాఫీ త్రాగి, వక్కపొడివేసుకుని, కుక్కపిల్లతో ఆడుకుంటూ సాయంత్రాలు షికార్లు తిరిగొచ్చి - డాబా మీదకు పేకాడుకుందుకు రమ్మనిపిల్చి తేనెసీసా పట్రమ్మంటారూ?

చదువుకోకపోతే అంత లోకువన్నమాట!

ఎమ్మేనో బియ్యేనో చదివిన అమ్మాయిని అట్లా అనండి చూద్దాం!

అప్పుడు నాకు ఇంగ్లీషు బాగారాదు కనుక ఇంగ్లీషులో వేళాకోళం చేయగలిగారు.

ఆవేళ రైల్లోమీపప్పులేం వుడకలేదు. గొప్ప దర్జాగా సెకండ్ క్లాస్ టిక్కెట్టు కొన్నారు. అంటె ఇప్పటి ఫస్ట్‌క్లాస్ పూర్వం సెకండ్ క్లాసండోయ్.

ఇప్పుడన్నీ అంతేలేండి.

టి.టి.సి..... మిమ్మల్ని దబాయించాడు. ఈ పిల్లనెవర్నో ఎత్తుకొస్తున్న బాపతు అన్నట్లుచూశాడు మీకేసి. మీ కర్థం కాలేదు కాని, నేను పరికిణీ కట్టుకున్నాను.

మీరు పాంటుతొడుక్కుని బైతులా చొక్కా మోకాళ్ళ కిందకి పైన వేసుకున్నారు.

ఆ సిల్కు చొక్కా ఆ వుంగరాల జుత్తూ చూసి ఏడిపిద్దామనుకున్నాడు టీ.టీ.సి.

ఇది మెయిలు మీ టిక్కెట్లు ప్యాసింజరు కున్నాయి డబ్బుకట్టమన్నాడు.

మీ దగ్గర డబ్బేది? తెల్లమొగం వేశారు. పోనీ – పాపంగదా అని ట్రంకు పెట్టె తీసి ట్రాఫీలపెట్టెలోదాచిన పూసల మనీపర్సులోంచి పదిరూపాయల నోటు తీసిమీకు "అప్పు" పెట్టాను.

ఆ టిక్కెట్లవాడు ఆ పదిరూపాయలూ లంకించుకుని ఏదో కొంత చిల్లర, ఇన్ని కాగితం ముక్కలూ మీ చేతిలో పెట్టాడు.

ఆ రైల్లో మీరు మెడ ఇవతలకి పెట్టడం – ఆపక్కపక్క కిటికీ లోంచి చేతులూపుకుంటూ వెనక్కు పరుగెట్టుకు పోయే చెట్లు చేమల్ని చూస్తూ ఆ టకటక చప్పుళ్ళకు ఉత్తేజపడిపోతూ మధ్య మధ్యన చలిమిడి జంతికలు, బటాణీలు తింటూ కాఫీ మరియు సోడా త్రాగుతూ ఎట్ట కేలకు విశాఖపట్నం వచ్చి పడ్డాము. ఆ రాత్రి పదకొండున్నరకు రైలు ప్లాటు ఫారం మీదకు వచ్చి ఆగింది.

వాల్తేరు స్టేషన్నుంచి లలితానగరం జైలు రోడ్డువరకు పెట్టిబండిలో మనిద్దరం కూర్చుని చాలా కులాసాగా వెళ్ళాము.

మన్నెవ్వరూ చూడ్డం లేదనుకుని చాలా ఖుషీగా చేతులూపుకుంటూ తిరిగాము.

ఆ వేళ ఆ పెట్టిబండీలోకి పడిన వెన్నెట్లో కిలాకిలా నవ్వు కుంటూ – ఇంటికి వెళ్లిన ఆనందం మరపురాదు.

మీరూ నేనూ సరదాగా – తెలిసీ తెలియని వయసులో అజ్ఞానంగా ఆ పెట్టి బండిలో కేరింతలు కొడుతూ ఇంటికి చేరేసరికి ఆ ముఖాల్లోని తళ తళ కాంతిని చూసి అంతా చుట్టూ మూగి మనకు హారతిచ్చి దిష్టి నీళ్ళు తీసి లోపలికి తీసుకెళ్ళారు.

అప్పుడు మీ దగ్గర పెట్టి బండివాడి కివ్వడానికి ముప్పావలా లేదు. అర్ధరూపాయే వుంది. అప్పుడు మరో పావలా అప్పుపెట్టాను. నీ దగ్గర డబ్బులన్నీ లాగేస్తాడే వాడు–మరివ్వకు అని అంది అత్తయ్య. అలాగే అయింది పది లాగెయ్యలేదు అంతా లాగేశారు.

అలనాడు పెట్టి బండిలోకి వెన్నెలలు కురిపించిన చందమామ ఇప్పుడు చాపమీద వరసాగ్గా పడుకున్న సైజుల వారీ సంతానం మీద వారి ముఖాల మీదచిరునవ్వుల వెన్నెలలు కురిపిస్తేచాలు; దేవుడా వారి ముఖాల మీదకు చీకటి చారికలు పడనీయకు.

చీకటి చారికలు వద్దు;

ఇలా పచ్చడి రుబ్బుకుంటూ తెగీ తెగని జ్ఞాపకాలను నెమరువేసుకుంటుంటే మనస్సు ఏదోలా పరవశించి పోతుంది. గాలికి ఎటో ఎటో తేలిపోతున్నట్లు వుంటుంది.

అప్పుడు మనం బీచ్చికి వెళ్ళేవాళ్ళం

బీచ్చి దగ్గర వేరుశనక్కాయలకి బేడా అప్పుపెట్టాను.

అప్పుడు మీకు కథ వ్రాసిన డబ్బొస్తే... నన్ను లైటు హవుస్ దగ్గర ఇంగ్లీషు సినిమాకి తీసుకెళ్ళారు. అదేనేమో మొదటిసారి ఇంగ్లీషు సినిమా చూడ్డం ఒళ్ళంతా కంపరమెత్తి పొయిందంటె నమ్మండి.

మాటలు ఎలాను తెలీవుకదా; ఆ మాట్లు మీక్కూడా అర్థవయివుండవులెండి (ఆ ఏడు ఇంగ్లీషులోనేగా పరీక్ష పోయిందీ). ఆ ఆడవాళ్ళు మొగవాళ్ళూ ఒకళ్లమీదొకళ్ళు పడిపోవడమేనా. వూరిఖే ముద్దులెట్టేసుకోవడమేనా... శ్రీరామా రామా - ఇంటికొచ్చాక స్నానం చేయాలనిపించింది. ఎవడు తండ్రో ఎవడు అన్నగారో, ఎవడుభర్తో తెలిసేదవదు. అత్తయ్యమొగం చూడలేక పోయాను. మహాపాపం చేసినట్లు ప్రహ్లాదో యోగి వేమనో పిక్చరు చూసేవరకు పుణ్యావచనం అయిందికాదు.

అబ్బ-ఏవిటో జ్ఞాపకాలూరిఖే వస్తున్నాయ్ ఈ పచ్చడి రుబ్బుతుంటె.

ఈ రుబ్బడం మానేస్తే ఈ జ్ఞాపకాలు రావడం మానేస్తాయ్ కాబోలు.

ఇదిగో ఏమండోయ్... మిమ్మల్నే పెసరపచ్చడి రుబ్బుతుంటే ఇలాటి భావాలు జ్ఞాపకాలొస్తున్నాయిగదా - కంది పచ్చడి రుబ్బుతుంటె ఇంకెలాంటి భావాలొస్తాయో?

మాటాడరేవండి? బెల్లం కొట్టిన రాయిలాగా (క్షమించాలి; బెల్లం కాఫీతాగిన అని వుండాలి)

# నుదుటన్ వ్రాసిన వ్రాలు - దడిగాడు వానసిరా

ఆరణాలన్నర లేకపోతే అర్ధరూపాయకు దొరికే కొబ్బరికాయకు ముక్కూ చెవులూదిద్ది బొట్టూ కాటుకా పెట్టి, ఒక రవికె గుడ్డచుట్టి దానినో మరచెంబులో దూర్చి పూజలుచేసి మంగళహారతులిచ్చినంత మాత్రాన ఆ వరలక్ష్మిదేవి కోరిన వరాలిచ్చేస్తే - ఆ వేళ మధ్యాహ్నం బాడ్మింటన్ ఆడొచ్చి గుండెలో నొప్పిగా వుందని కాసిని మంచి నీళ్ళు పట్రమ్మని తెచ్చేలోగా సోడా తాగి మంచం మీద నడుంవాల్చి మరి పక్కమీదనుంచి లేవకుండానే మా కమలక్క మాంగళ్యాన్ని కూడా పట్టుకుపోయిన మా బావగారు సిమెంటు ఫ్యాక్టరీలో నాలుగొందల జీతగాడు. పండంటి సంసారాన్ని, పసిపిల్లల్నీ ఇల్లూవాకిలీ వదిలి చెప్పకుండా చెయ్యకుండా